

హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డుపై ప్రమాదం

హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఇద్దరు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. - 8లో



ఎంత పని చేశావమ్మా..!

ఆ బాలికకు ఏం కష్టమొచ్చిందో.. ఏమో.. బలవన్మరణం పొందింది. ఈ సంఘటన రాయచోటి పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.620	రూ.740
రెండోరకం	రూ.460	రూ.600



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 98 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	435	560
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 368.340 కిలోలు

న్యూస్‌రీల్

ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని, చట్టపరిధిలో విచారణ చేసి, న్యాయం అందించడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం రాయచోటిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ నేరుగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కారం చూపాలన్నారు.

వరద బాధితులకు మిట్స్ ఔదార్యం



నారాలోకేష్‌కు చెక్కును అందజేస్తున్న ఎన్.విజయభాస్కర్ చౌదరి

కురబలకోట : మదనపల్లె దగ్గర అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల నిర్వాహకులు డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో వరద బాధితులకు రూ.24 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. రెండు విడతలుగా ఈ సాయాన్ని ఆయన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు మంగళగిరిలో కలిసి అందించారు. తొలి విడతలో రూ.5 లక్షలు, తాజాగా రూ.19 లక్షల చెక్కును సీఎం సహాయ నిధికి ఆయన అందజేసి తన ఔదార్యం చాటుకున్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు తమ వంతు సాయంగా దీనిని అందించినట్లు నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ



పల్లకీలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఊరేగింపు

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి పల్లకీ సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు పూజలు, అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ ప్రాంగణం, మాడ వీధుల్లో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

డిగ్రీ ఒకేషనల్ పరీక్షలు వాయిదా

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 15 నుంచి జరగాల్సిన డిగ్రీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వర రెడ్డి తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుపాను ప్రభావం అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలపై ఉంటుందని ప్రకటించిన నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు.

వైద్య విద్యను బాధ్యతగా అభ్యసించాలి

కడప అర్బన్ : విద్యార్థులు వైద్య విద్యను బాధ్యతగా అభ్యసించాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 2024–25 బ్యాచ్ వైద్య విద్యార్థులకు, వారి తల్లిదండ్రుల సమక్షంలో స్వాగతం పలికారు. తొలుత ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ జ్యోతిప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, అనస్తీషియా హెచ్‌ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్ల, డాక్టర్ లక్ష్మీనరసమ్మ, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అధికారానికే లక్కు!

- జిల్లాలోని మద్యం షాపుల్లో అధిక శాతం కూటమి వర్గీయులకే
- మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తెకు వరించిన ఆరు షాపులు
- రాష్ట్ర మంత్రి మండిపల్లి సోదరుడికి దక్కిన దుకాణం
- ఆది నుంచి ఏకపక్షంగా సాగిన వ్యవహారం
- మద్యం షాపుల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తి



రాయచోటిలో మద్యం షాపుల లాటరీ పద్ధతి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న దరఖాస్తుదారులు



లక్కీడ్రాను చూపిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో జేసీ ఆదర్శరాజేంద్రన్, ఈఎస్ మధుసూదన్‌రావు

సాక్షి రాయచోటి/రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అబ్కారీ షాపులకు మంగళం పాడి ప్రత్యేకంగా మద్యాన్ని పారించేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు షాపులకు విపరీత డిమాండ్ ఏర్పడింది. అయితే అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే దరఖాస్తుల ప్రక్రియ కొనసాగింది. బెదిరింపులు, ఒత్తిళ్లు, రాజకీయ ప్రేరేపితాలతో ఎట్టకేలకు మద్యం షాపుల ఏర్పాటుకు.. చాలా మంది వెనుకంజ వేసేలా చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని అజయ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన లక్కీడిప్‌లో కూడా అత్యధిక శాతం షాపులన్నీ కూటమి వర్గీయుల వశమయ్యాయి. వారు బెదిరింపులకు దిగడంతో.. దరఖాస్తు చేసుకునేందుకు వ్యాపారులు, ప్రతిపక్షపార్టీలతోపాటు ఇతర పార్టీల వారు వెనుకంజ వేశారు. లక్కీ డిప్‌లో కూడా అధికార పార్టీకి చెందిన వారికే షాపులన్నీ హస్తగతం అయ్యాయి. ఒకటో, అరో ఇతరులకు దక్కినా అక్కడ కూడా కూటమి నేతలు బరి తెగించి భయపెడుతున్నారు. భాగం ఇస్తారా... లేక షాపులను ఎలా నడుపుతారో చూస్తామంటూ లోలోపల భయపెడుతుండడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పలువురు అభివర్ణిస్తున్నారు.

కూటమి వర్గీయులకు దక్కిన షాపులు

అన్నమయ్య జిల్లాలో 111 మద్యం షాపులకు సంబంధించి 2160 దరఖాస్తులు వచ్చాయి. పీలేరు, తంబళ్లపల్లె తదితర ప్రాంతాల్లో అధికార పార్టీ వారే అధిక సంఖ్యలో దరఖాస్తులు వేసి.. మిగతా వారు వేసినా షాపులు నిర్వహించలేరంటూ ప్రచారం చేయడంతో చాలా వరకు దరఖాస్తులు తగ్గిపోయాయి. ప్రస్తుతం నిర్వహించిన లక్కీ డిప్‌లో కూడా 70 శాతం వరకు కూటమి పార్టీకి చెందిన వారికే దక్కాయి. మిగతా వారికి ఒకటి, అర షాపులు లభించాయి. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె ఇలా అన్ని చోట్ల ముఖ్య నేతల అనుచరులే సిండికేట్‌గా మారి షాపులు దక్కించుకుంటున్నారు. ఒకవైపు ప్రభుత్వం అందరికీ అవకాశమని చెప్పినా.. అన్నమయ్య జిల్లాలో దాదాపుగా కూటమి నేతలకే షాపులు లక్కీగా మారాయి.

లక్కిరెడ్డిపల్లెలో..

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లక్కిరెడ్డిపల్లెలోని రెండు షాపులు టీడీపీ వర్గీయులకు లభించాయి. రాయచోటిలో తీసిన లక్కీడ్రాలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు రాహుల్‌రెడ్డికి 18వ నెంబరు షాపు దక్కింది. అలాగే మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి బంధువు అయిన కిరణ్‌కుమార్‌రెడ్డికి లక్కీ డ్రాలో షాపు లభించింది.

మాజీ ఎంపీ కుమార్తెకు..

అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన లక్కీ డిప్‌లో నంద్యాల దివంగత నేత, మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సానపురెడ్డి సుజలకు ఆరు షాపులు వరించాయి. ప్రధానంగా రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెంలో రెండు, పీలేరులో రెండు, అదే నియోజకవర్గంలోని కలికిరిలో రెండు షాపులు కలుపుకొని మొత్తం మీద ఆరు షాపులు దక్కాయి. ఇక్కడే కాకుండా వైఎస్సార్ జిల్లాతోపాటు నంద్యాల జిల్లాలోనూ ఆమెకు షాపులు దక్కినట్లు సమాచారం.

ప్రశాంతంగా లక్కీ డ్రా

అన్నమయ్య జిల్లాలో మద్యం షాపుల కేటాయింపునకు సంబంధించి లక్కీ డ్రా కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. అజయ్ కన్వెన్షన్ సెంటర్‌లో ముందుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసీ ఆదర్శ రాజేంద్రన్ ఆధ్వర్యంలో రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంటలోపే ముగించారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సుమారు 200 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.

బెదిరింపుల పర్వం

జిల్లాలో ఇతర పార్టీల నేతలు, స్థానికులకు లక్కీ డ్రాలో షాపు దక్కినా వారి ఆనందాన్ని, కూటమి నేతలు ఆవిరి చేస్తున్నారు. సంబేపల్లె, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఇతరులకు దక్కిన షాపులపై కూటమి నేతలు దృష్టి సారించారు. స్థానికంగా తమకు భాగం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇవ్వకపోతే షాపు ఎలా నడుపుతారో చూస్తామని బెదిరింపులకు దిగుతున్నారు. అంతేకాకుండా షాపు విషయంగా మధ్యవర్తుల ద్వారా భాగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా షాపు దక్కిందన్న ఆనందం కంటే తర్వాత వచ్చే ఇబ్బందులతో వారు లోలోన మథనపడుతున్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ

రాయచోటి (జగదాంబసెంటర్) : సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో కూడిన మూడు నెలల పాటు శిక్షణ పొందుటకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు నమోదుకు ఈ నెల 21వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్జీటీ పోస్టులకు ఇంటర్మీడియెట్‌తోపాటు డైట్ సెట్, టెట్.. స్కూల్ అసిస్టెంట్లకు డిగ్రీ, బీఈడీ, టెట్ విద్యార్హతలు కలిగిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలన్నారు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

- ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువు : ఈ నెల 11వ తేదీ నుంచి 21 వరకు
- హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్ : 22 నుంచి 25
- పరీక్ష తేదీ : 27
- మెరిట్ లిస్ట్ ప్రకటన తేదీ: 28
- జిల్లాల వారీగా ఎంపికైన వారి లిస్టు ప్రకటన: 30
- కోచింగ్ సెంటర్ వారీగా అభ్యర్థుల ఎంపిక తేదీ : నవంబర్ 3
- కోచింగ్ మొదలవు తేదీ : నవంబర్ 6

ఎలైట్ వరల్డ్ రికార్డు అవార్డు ప్రదానం



అవార్డుతో సురేష్‌బాబు

పీలేరు : పీలేరు పట్టణానికి చెందిన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా గవర్నర్ సోమిశెట్టి సురేష్‌బాబుకు ఎలైట్ వరల్డ్ రికార్డు అవార్డు లభించింది. గత నెల 28న వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ (విత్తనాలు) చల్లే కార్యక్రమం చేపట్టారు. ఒకే రోజే 514 ప్రాంతాల్లో 1,00,00,789 సీడ్‌బాల్స్ తయారు చేసి చల్లారు. ఇందులో 30 మంది వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్లు, 38,041 మంది వలంటీర్లు పాల్గొన్నారు. దీంతో 30 మంది గవర్నర్లకు ఎలైట్ వరల్డ్ రికార్డు అవార్డు అందజేశారు. ఇందులో భాగంగా సోమిశెట్టి సురేష్‌బాబుకు అవార్డు లభించింది.

ఎడతెరిపిలేని వర్షం

రైల్వేకోడూరులో అత్యధిక వర్షపాతం



రాయచోటిలో కురుస్తున్న వర్షం



రాజంపేటలో ప్రధాన రహదారిలో నిలిచిన నీరు

రాయచోటి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడుతున్నాయి. జిల్లాలో రైల్వేకోడూరులో 94.6 మిల్లీమీటర్ల మేర భారీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 778.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మరో రెండు రోజుల పాటు మరింత భారీగా వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం వర్షాలకు పంట నష్టం జరగలేదు.

విపత్కర పరిస్థితులు ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలి

రాయచోటి : భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. వర్షాల వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, 24/7 ప్రకారం సిబ్బంది విధుల్లో ఉండాలన్నారు. 15, 16వ తేదీలలో అత్యధికంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సూచనలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని వివరించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

భారీ వర్షాల నేపథ్యంలో రాయచోటి జిల్లా కలెక్టరేట్‌లో 08561-293006 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్‌లో 24/7 ప్రకారం సిబ్బందిని విధులకు నియమించారు.

విద్యుత్ కంట్రోల్‌రూం ఏర్పాటు

రాజంపేట రూరల్ : ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయంలో సోమవారం విద్యుత్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని ఈఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 7382669890 నంబరును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. 24 గంటలు వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం మండలాల వారీగా..

మండలం	వర్షపాతం(మిమీ)	మండలం	వర్షపాతం(మిమీ)
గాలివీడు	25.8	ములకలచెరువు	19.6
చిన్నమండెం	15.8	తంబళ్లపల్లి	16.0
సంబేపల్లె	20.0	పెద్దమండెం	19.4
టి.సుండుపల్లి	29.8	గుర్రంకొండ	9.8
రాయచోటి	27.4	కలకడ	13.4
లక్కిరెడ్డిపల్లి	19.4	కుంభంవారిపల్లి	16.0
రామాపురం	24.6	పీలేరు	15.6
వీరబల్లి	28.4	కలికిరి	14.6
నందలూరు	56.4	వాల్మీకిపురం	12.6
పెనగలూరు	53.2	కురబలకోట	22.0
చిట్వేలి	50.0	పెద్దతిప్పసముద్రం	3.2
రాజంపేట	45.4	బి.కొత్తకోట	3.2
పుల్లంపేట	47.4	మదనపల్లి	17.8
ఓబులవారిపల్లి	34.0	నిమ్మనపల్లి	14.4
కోడూరు	94.6	రామసముద్రం	7.2

రాయచోటి ట్రాన్స్‌కో కార్యాలయం పరిధిలో కంట్రోల్ పాయింట్ల నంబర్లు

9848903824, 798124 0489, 7207043416

ముందస్తు చర్యలు తీసుకోవాలి

రాయచోటి టౌన్ : వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రాజంపేట : తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సోమవారం విజ్ఞప్తి చేశారు. తీవ్రమైన పెనుగాలులు, పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర విపత్తుల శాఖ సూచనలు ఇప్పటికే జారీ కావడం జరిగిందన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రావద్దని సూచించారు.

చెరువును చెరపట్టి.. ఇసుక కొల్లగొట్టి..

- అధికారమే అండగా చెలరేగుతున్న నేతలు
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం



కొత్త చెరువులో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలింపు

గుర్రంకొండ : రాజులు, గత పాలకులు దూరదృష్టితో వ్యవసాయానికి ఉపయుక్తంగా చెరువులు నిర్మించి అభివృద్ధి చేశారు. ఆ చెరువులు రైతాంగానికి జీవనాడి. అలాంటివి నేడు ఇసుకాసురుల కోరల్లో చిక్కుకుని రూపు కోల్పోతున్నాయి. అధికారమే అండగా కూటమి నాయకులు చెలరేగడంతో ఇలాంటి పరి(దు)స్థితి దాపురించింది. ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించే నాథుడే కరువయ్యారు.

రీచ్‌లు లేకున్నా..

మండలంలో ఎక్కడా ఇసుక రీచ్‌లు లేవు. ఇక్కడి ప్రజలు తమ నిర్మాణ అవసరాల నిమిత్తం ఇసుకను సమీప కుంటలు, చెరువుల నుంచి తెచ్చుకొంటున్నారు. ఇదే అదునుగా కొంత మంది నాయకులు ఇసుకను బయటి ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నారు.

జేసీబీలతో తవ్వకాలు

చెరువుల్లో ముందుగా పైన మట్టిని జేసీబీలతో తవ్వకాలు చేపడుతున్నారు. పైన రెండు నుంచి నాలుగు అడుగుల మేరకు ఉన్న మట్టిని తొలగించేస్తున్నారు. తవ్వేసిన మట్టిని ట్రాక్టర్ల ద్వారా ఇటుక బట్టీలకు తరలించి విక్రయించేస్తున్నారు. ఆ తరువాత టన్నుల కొద్దీ ఇసుక నిల్వలు బయటపడుతున్నాయి. తదనంతరం పట్టపగలే జేసీబీలతో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించేస్తున్నారు.

పక్క మండలాలకు తరలింపు

మండలంలోని మర్రిపాడు, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, బోడిగుట్ట సమీప చెరువుల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. కొంత మంది వ్యక్తులు చెరువులను ఆక్రమించేశారు. వీటిలో చేరిన టన్నుల కొద్దీ ఇసుకను బహిరంగంగా టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. రోజూ పదుల కొద్ది ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా బయటి మండలాలకు పంపిస్తున్నారు. పక్కనే ఉన్న వాల్మీకిపురం, కురబలకోట మండలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ. 3 వేల నుంచి 3,500కు విక్రయిస్తున్నారు. స్థానిక కొంత మంది నేతలు ఇళ్ల నిర్మాణాల నిమిత్తం ఇసుకను తరలిస్తున్నామని చెప్పుకొంటూ.. రాత్రిళ్లు ఇష్టానుసారంగా బయట ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.

చెరువు కట్ట కిందే తవ్వకాలు

మండలంలోని పలు గ్రామాల్లో చెరువుల కట్ట కింద అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. జేసీబీలతో రాత్రిళ్లు తవ్వేసి పగలు ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దీంతో చెరువు కట్టకింద గోతులు ఏర్పడి.. కట్ట ప్రమాదకర స్థితికి చేరుకుంటోంది. వర్షాలు కురిసి చెరువులో నీరు చేరితే కట్ట పరిస్థితి అనుమానాస్పదంగా ఉంటుందని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు పలు గ్రామాల్లో చోటు చేసుకొన్నాయి.

ప్రమాదకరంగా గుంతలు

మండలంలోని మర్రిపాడు, తరిగొండ చెరువుల్లో ఉన్న ఇసుక గుంతలు ప్రమాదకరంగా మారాయి. చెరువుల్లో పదుల కొద్దీ అడుగుల లోతు వరకు గుంతలు తవ్వేశారు. వర్షాలు కురిసినప్పుడు గుంతల పైభాగంలో ఉన్న మట్టిపెళ్లలు మెత్తబడి నెర్రెలు చీలుతాయి. కూలీల క్షేమం కోరే వారైతే.. వర్షాలు నిలిచిపోయిన తరువాత గుంతలపైభాగంలో ఉన్న మట్టిపెళ్లలను ముందుగా తొలగించాల్సి ఉంటుంది. ఆ తరువాత ఇసుకను తోడేందుకు వెళ్లినా ఎలాంటి ప్రమాదం జరగదు. అయితే ఇవేమీ పట్టని ఇసుకాసురులు ధనార్జనే ధ్యేయంగా భావించి.. కూలీలను అలాగే గుంతల్లోకి దింపేస్తున్నారు. దీంతో ప్రమాదం పసిగట్టలేక కూలీలు.. అకస్మాత్తుగా కుప్పకూలిపోయే మట్టిపెళ్లల కింద పడి మృతి చెందుతున్నారు.

వెలుగు చూడని మృతి సంఘటనలు

మట్టి పెళ్లలు మీద పడి ఎంతో మంది కూలీలు మృతి చెందుతున్నా.. వాస్తవానికి ఆ సంఘటనలు వెలుగుచూడడం లేదు. గతంలో మామిళ్లవారిపల్లె వద్ద నాగరాజు అనే కూలీ మృతి చెందాడు. అప్పట్లో చంద్రన్న బీమా వస్తుందని భావించిన కూలీ కుటుంబం ఇసుకాసురులపై తిరగబడటంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ సంఘటన అప్పట్లో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇలా జరిగిన ప్రమాదాల్లో పలు గ్రామాలకు చెందిన ఐదుగురు కూలీలు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి.

ఘర్షణ

ఇటీవల రెండు నెలలుగా మర్రిపాడులో వందలాది టిప్పర్లతో ఇసుకను అక్రమంగా తరలించేశారు. ఈ నేపథ్యంలో చెరువుకు రెండు వైపులా గ్రామాల్లో కొంత మంది ఇసుక తరలించే విషయంపై ఘర్షణ పడ్డారు. ఇసుకను అక్రమంగా తరలించకూడదంటూ గ్రామస్తులు తిరగబడి ఇసుకాసురులపై దాడికి దిగారు. దీంతో గ్రామాల్లో వరుస దాడులు చేసుకొన్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ దాడుల్లో పలువురు గాయాల పాలయ్యారు. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది.

బాధ్యత మాది కాదు మీదే

అధికార పార్టీ నేతల అండతో కొంత మంది కార్యకర్తలు ఇసుకను కొల్లగొడుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టాల్సిన అధికారులు.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. బాధ్యత మాది కాదు.. మీదేనంటూ వివిధ శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెపం వేసుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అయితే మామూళ్లు తీసుకుని.. మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ రవాణాపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. చెరువులు ఇరిగేషన్ శాఖకు చెందినవి కాబట్టి సంబంధిత అధికారులే చర్యలు తీసుకోవాలంటూ సమాధానమిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సింది రెవెన్యూ అధికారులేనని చెబుతున్నారని తెలిపారు. సంబంధిత రెండు శాఖల అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకుంటే.. తాము కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పి తప్పించుకుంటుండటం గమనార్హం.

ఇరిగేషన్ అధికారులదే బాధ్యత

చెరువుల్లో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొని చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖ అధికారులపైనే ఉంది. మేము చెరువుల వద్దకు వెళ్లి అడ్డుకొంటున్నా ఫలితం ఉండటం లేదు. ఇరిగేషన్ శాఖ అదికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపడితేనే.. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చు.

– రెడ్డిశేఖర్, వీఆర్వో, తరిగొండ

రెవెన్యూ అధికారులే చర్యలు చేపట్టాలి

చెరువుల్లో ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉంది. మండలంలో ఐదు చెరువులు ఇరిగేషన్ శాఖకు చెందినవి ఉన్నాయి. వీటిలో మూడు చెరువుల్లో ఇసుకను ఎక్కువగా తరలించేశారు. ఇసుకను తరలించే వాహనాలను అడ్డుకొని చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపైనే ఉంది.

– ఈశ్వరీ, ఇరిగేషన్ ఏఈ, గుర్రంకొండ

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

వాల్మీకిపురం : గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన వాల్మీకిపురం పట్టణం తిరుచుట్టివీధిలో చోటు చేసుకొంది. వివరాలు.. తిరుచుట్టివీధికి చెందిన సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి నెల రోజుల క్రితం విదేశాలకు వెళ్లారు. ఇదే అదనుగా గుర్తు తెలియని దుండగులు సుధీర్ రెడ్డి ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలు, కప్‌బోర్డులను ధ్వంసం చేసి అందులోని వెండి వస్తువులతో పాటు బంగారు నగలు, విలువైన వస్తువులు దోచుకెళ్లారు. స్వదేశానికి చేరుకున్న సుధీర్ రెడ్డి సోమవారం వాల్మీకిపురంలోని తన సొంత ఇంటికి వచ్చారు. ఇదే సమయంలో ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గమనించి స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. తెలిసిన వ్యక్తులు, లేదా స్థానికులే చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి


అతిగా మద్యం తాగి మృతి చెందిన భాస్కర్‌రెడ్డి

మదనపల్లె : అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. కర్నాటక రాయల్పాడు బలమత్తూరుకు చెందిన భాస్కర్‌రెడ్డి(36) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి అతిగా మద్యం తాగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పులివెందులలో ఈ-స్టాంపుల కొరత

పులివెందుల టౌన్ : పులివెందులలో గత 50రోజుల నుంచి ఈ-స్టాంపుల కొరత ఏర్పడింది. దీంతో ఈ-స్టాంపులు కావాల్సిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు ఈ-స్టాంపింగ్‌ను ప్రవేశ పెట్టింది. ఈ-స్టాంపింగ్ ద్వారా రూ.10, రూ.20, రూ.50,రూ. 100ల స్టాంపులను ప్రింటింగ్ చేసి ఇచ్చేవారు. గతంలో స్టాంపులను వారి పేర్ల మీద తీసుకుని వారికి కావాల్సిన విధంగా రాసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారనే కారణంగా ఈ-స్టాంపింగ్‌ను గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు సజావుగా జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎందుకో, ఏమో తెలియదు కానీ గత 50 రోజులుగా ఈ-స్టాంపులు ఇవ్వడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పులివెందుల ప్రాంత ప్రజలకు సజావుగా ఈ-స్టాంపింగ్ అందే విధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డుపై ప్రమాదం

ఇద్దరు కర్ణాటక పర్యాటకులకు తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన పవన్


ప్రమాదంలో ధ్వంసమైన బైక్

బి.కొత్తకోట : సరదాగా హార్సిలీహిల్స్ చూసొద్దామని బైక్‌లపై వచ్చిన కర్ణాటకకు చెందిన పర్యాటకులు ఘాట్‌రోడ్డుపై ప్రమాదానికి గురయ్యారు. పోలీసుల కథనం మేరకు సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు.. కర్ణాటకలోని కేజీఎఫ్‌కు చెందిన ఎం.పవన్‌కుమార్ (23), భరత్ (20)ఒక బైక్‌పై, మిగిలిన వారు మరో రెండు బైక్‌లపై హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. అలాగే మదనపల్లె ఎగువ కురవంకకు చెందిన పునీత్ కుమార్ (20) కారు హార్సిలీహిల్స్ నుంచి వెనుదిరిగింది. మధ్యాహ్నం 3 గంటలు దాటిన తర్వాత కిందకు వస్తున్న కారు, పైకి వెళ్తున్న బైకు కింద నుంచి నాలుగో మలుపు దాటగానే ఎదురెదురుగా ఢీకొనే ప్రమాదాన్ని పసిగట్టిన కారు నడుపుతున్న పునీత్ ప్రమాదాన్ని నివారించేందుకు సడన్ బ్రేక్ వేశాడు. దీంతో కారు మలుపు తిరిగి ప్రమాదానికి గురైంది. ఇదే సమయంలో బైక్ అదుపు కాకపోవడంతో కారును ఢీకొంది. దీంతో బైక్ పూర్తిగా ధ్వంసమైంది. బైక్ నడుపుతున్న పవన్‌కు కాలు, చేయి విరిగింది. వెనుక కూర్చున్న భరత్‌కు తీవ్ర గాయమైంది. కారులోని వారికి ఎలాంటి ప్రమాదం కాలేదు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో మదనపల్లెకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాధితులను బెంగళూరుకు తీసుకెళ్లినట్టు తెలిసింది. ఈ ఘటనతో విహార యాత్ర విషాదంగా మారింది.

ఎదురెదురుగా వాహనాలు ఢీకొని..

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె మండలం కొండామారిపల్లె పంచాయతీ బెస్తపల్లెకు చెందిన గంగులప్ప భార్య సీతమ్మ(46) బ్యాంకు పనిపై తెలిసిన వ్యక్తితో మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తుండగా, బైపాస్ రోడ్డులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో సీతమ్మ తీవ్రంగా గాయపడింది. అదేవిధంగా కడప చిన్నపరెడ్డిపల్లెకు చెందిన వీరభద్రారెడ్డి కుమారుడు శివకాశిరెడ్డి(26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సోమవారం స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని కారు, ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో శివకాశిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం శివకాశిరెడ్డిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆటో


రామసముద్రం మండలం కేసీ పల్లె వద్ద రోడ్డు ప్రమాదంలో ఢీకొన్న వాహనాలు

రామసముద్రం : మండలంలోని కేసీ పల్లె సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. మూగ ఎర్రప్పల్లెకు చెందిన రమణ, అతని కుమార్తె పుంగనూరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా, కేసీ పల్లెకు చెందిన జబ్బార్ ఆటోలో పుంగనూరుకు వెళుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ స్పృహ కోల్పోవడంతో స్థానికులు ముగ్గురిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి తండ్రీ కొడుకులకు..



గాయపడిన రామచంద్ర, శ్రీనివాసులురెడ్డి

బి.కొత్తకోట : ఎదురుగా ఆవులు రావడంతో బైక్ అదుపు తప్పి తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలోని నాయనబావి వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు..ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లె పంచాయతీ ఎర్రంరెడ్డిగారిపల్లెకు చెందిన తండ్రీ కొడుకులు రామచంద్ర (58), శ్రీనివాసులురెడ్డి (35) వ్యక్తిగత పనులపై బి.కొత్తకోటకు వచ్చారు. పనులు చూసుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. బి.కొత్తకోట నుంచి మదనపల్లె మార్గంలో వెళ్తుండగా నాయనబావి వద్ద రోడ్డుపై ఆవులు అడ్డంగా రావడంతో బైక్‌ను నిలిపే ప్రయత్నంలో అదుపు తప్పింది. దీంతో ప్రమాదానికి గురైన తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లిక్కర్‌పై ఉన్న శ్రద్ధ నిత్యావసర సరుకులపై లేదా?

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లిక్కర్‌పై ఉన్న శ్రద్ధ నిత్యావసర సరుకులపై లేదా అని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన మాయమాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చే కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. విజయవాడ వరదలు, తిరుమల లడ్డు కల్తీ ఇవేవీ ఫలించకపోవడంతో మాయ మాటలు చెబుతూ తాజాగా మద్యం పాలసీలో అస్మదీయులకు లాభం చేకూర్చాలనే ఉద్దేశంతో మద్యం పాలసీని తెచ్చారని తెలిపారు. తమ పార్టీ వారికి దోచిపెట్టడానికి ప్రతి నియోజకవర్గంలో సిండికేట్లు ఏర్పాటు చేయడంతో టీడీపీ నాయకులు దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. అలాగే ఇసుక నుంచి మొదలుకుని ప్రతి భూగర్భ ఖనిజాన్ని దోచుకుంటున్నారన్నారు. నిత్యావసర సరుకులు ధరలు తగ్గిస్తామని డబ్బా కొట్టుకుంటూ తిరిగిన బాబు నేడు వాటి గురించి పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరుచుకొని పరిపాలన చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సిహెచ్ రమేష్, మల్లికార్జున, రఘు, రవి, సుధాకర్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్ర ఎన్నిక

జోరు వానలోనూ కలెక్టరేట్ ఎదుట డ్వాక్రా మహిళల నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న తంబళ్లపల్లె డ్వాక్రా మహిళలు

రాయచోటి అర్బన్ : నిబంధనలకు విరుద్ధంగా సంఘమిత్రను ఎంపిక చేయడం అన్యాయమని పలు డ్వాక్రా సంఘాల మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘమిత్రను ఎన్నుకునే తమ హక్కును కాపాడాలంటూ తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు గ్రామంలోని డ్వాక్రా మహిళలు జోరు వర్షంలోనూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పనిచేస్తున్న సంఘమిత్ర అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించిందన్నారు. డ్వాక్రా సంఘాల లీడర్లందరూ కలసి తమలో ఒక్కరిని సంఘమిత్రగా ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. డ్వాక్రా సంఘాల లీడర్లకు ఎలాంటి సమాచారం లేకుండా కనీసం సంఘంలో సభ్యురాలు కాని మహిళను సీసీ, ఏపీఎంలు కలసి సంఘమిత్రగా ఎంపిక చేయడం దారుణమన్నారు. సంఘమిత్ర ఏకపక్ష వైఖరి కారణంగా సభ్యులమైన తామంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాలతో సంబంధం లేని పురుషులు సైతం తమపై పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. గత నెలలో గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా ఉన్నతాధికారులకు తమ సమస్యను విన్నవించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని అధికారుల సమక్షంలో సంఘమిత్రను ఎన్నుకునే హక్కును తమకు కల్పించాలని విన్నవించారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వివాహం చేసుకున్న ప్రేమజంటకు కౌన్సెలింగ్


వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రేమజంటకు కౌన్సెలింగ్ నిర్వహించిన సీఐ చాంద్‌బాషా

మదనపల్లె : ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్న ప్రేమజంటకు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ చాంద్‌బాషా బంధువుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన సీతారామప్ప, శంకరమ్మల కుమార్తె సి.మౌనిక(19) మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం డిగ్రీ చదువుతోంది. సెప్టెంబర్ 29న తండ్రి సీతారామప్పతో కలిసి స్వగ్రామానికి వెళ్లేందుకు చిత్తూరు బస్టాండులో బస్సు ఎక్కే సమయంలో మౌనిక అక్కడి నుంచి అదృశ్యమైంది. ఈ విషయమై అక్టోబర్ 3న మౌనిక తల్లి శంకరమ్మ, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కూతురు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన సీఐ రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ దిన్నెమీద హరిజనవాడకు చెందిన వెంకటప్ప, శ్యామల కుమారుడు జి.శ్రీనివాసులు(23)తో మౌనిక వివాహం చేసుకున్నట్లుగా గుర్తించారు. ప్రేమజంటను సోమవారం వన్‌టౌన్ స్టేషన్‌కు తీసుకువచ్చి, అనంతరం తహసీల్దార్ ఖాజాబీ ఎదుట హాజరు పరిచారు. స్టేషన్‌లో ప్రేమజంటకు పూలదండలు మార్పించి, బంధువుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. వివాహానికి అర్హులైన యువతీ, యువకులు పెద్దలను ఒప్పించి లేదా చట్టబద్ధంగా పోలీసులను, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆశ్రయించి పెళ్లి చేసుకోవాలే కానీ పారిపోయి తల్లిదండ్రులను, పోలీసులను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు.

సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసిన న్యాయమూర్తి


హాస్టల్ గదిలోని స్టోర్ రూంను తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని సంక్షేమ హాస్టళ్లను రాయచోటి జిల్లా 5వ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రాయచోటి – రాజంపేట రోడ్డులోని గిరిజన సంక్షేమ హాస్టల్‌తో పాటు బీసీ హాస్టల్‌ను కూడా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వంట గదులు, స్టోర్ రూంలు, డార్మెంట్స్ ఇలా హాస్టల్‌లోని అన్ని గదులను పరిశీలించారు. అక్కడి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

పులివెందుల రూరల్ : ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులో ప్రభుత్వ మద్యం షాపులో జరిగిన చోరీకి సంబంధించి మరో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు మద్యం దుకాణంలోకి చొరబడి సుమారు రూ.4లక్షలు నగదు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. అప్పట్లో ఈ దొంగతనంపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి రెండో నిందితుడు అలెగ్జాండర్‌ను ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచామని సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు వివరాలు వెల్లడించారు. అలెగ్జాండర్ వృత్తిరీత్యా డ్రైవర్ అని తెలిపారు. పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో సంచరిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంత పని చేశావమ్మా..!

9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని భవ్యశ్రీ

రాయచోటి టౌన్ : ఆ బాలికకు ఏం కష్టమొచ్చిందో.. అసలేం జరిగిందో.. తన కష్టాన్ని.. బాధను ఎవరితో చెప్పుకోలేకపోయిందో.. ఏమో.. అన్నిటిని మౌనంగా దిగమింగి ఉరి వేసుకుని తనువు చాలించింది. కన్నవారికి కడుపుకోత మిగిల్చింది. ఈ విషాద సంఘటన రాయచోటిలో చోటుచేసుకుంది.

రాయచోటి పట్టణ పరిధిలోని రాయుడు కాలనీలో 9వ తరగతి విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాయచోటి రాయుడు కాలనీకి చెందిన రామకృష్ణ, రెడ్డెమ్మల కుమార్తె భవ్యశ్రీ రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో 9వ తరగతి చదువుతోంది. ఈ అమ్మాయి తల్లి జీవనోపాధికి కువైట్‌కు వెళ్లింది. అలాగే ఈ విద్యార్థిని తండ్రి కూడా కువైట్‌కు వెళ్లేందుకు ఆదివారం రాత్రి బెంగళూరుకు వైద్య పరీక్షలకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఈ బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలిక ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రిమ్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప రిమ్స్ ఆసుపత్రిలో సెప్టెంబర్ 21న పులివెందుల నుంచి ఉత్తన్న (50) అనే పేరుతో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స కోసం వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఆ వ్యక్తి మృతి చెందాడు. అతని మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. అతని మృతదేహానికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఉంటే తమను సంప్రదించాలని రిమ్స్ వైద్యులు తెలిపారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్


కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా డ్రాగా ముగిసింది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన కడప, కర్నూలు మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

నవంబర్ 9,10 తేదీల్లో కడపలో జాతీయ స్థాయి ఉర్దూ సెమినార్

కడప ఎడ్యుకేషన్ : అంజుమన్ తరక్కి ఉర్దూ (ఉర్దూ భాషాభివృద్ధి సంఘం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 9.10 తేదీలలో కడప నగరం నాగరాజుపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి ఉర్దూ సెమినార్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్ ఫైజి, సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్య, మైనార్టీశాఖ మంత్రులు, ఎంఎల్‌ఏలను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. వీరితో పాటు అన్ని పార్టీల నాయకులు, అధికారులు అంజుమన్ తరక్కి వివిధ జిల్లాల శాఖల ప్రతినిధులు, ఉర్దూ కవులు, రచయితలు, విమర్శకులు ఉర్దూ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. దేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి దాదాపు 24 మంది ఉర్దూకు సంబంధించి వివిధ అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పిస్తారన్నారు. అలాగే ఉర్దూ పుస్తకాల ఆవిష్కరణ, కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. ఉర్దూ హైస్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు, యూనివర్సిటీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామని వివరించారు.

ప్రజాస్వామ్యం.. అపహాస్యం

ప్రభుత్వ కార్యక్రమ వేదికలపై టీడీపీ నేతలు


వేదికపై ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డికి ఎంపీడీఓకు మధ్యలో కూర్చున్న టీడీపీ నేత విజయ భాస్కర్ రెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : టీడీపీ నేతల నిర్వాకంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోంది. కనీసం వార్డు సభ్యులు కూడా కాని వ్యక్తులు సైతం ప్రభుత్వ కార్యక్రమాల వేదికలపై ఆశీనులవుతూ అధికారులపై పెత్తనం చెలాయించడానికి ప్రయత్నిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

అది కూడా సాక్షాత్తూ ఎమ్మెల్యేల సమక్షంలోనే జరుగుతుండడం అటు ప్రజా ప్రతినిధులకు, ఇటు అధికారులకు మింగుడు పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, మండల సర్వసభ్య సమావేశాలు, మునిసిపల్ సమావేశాలకు ప్రొటోకాల్ మేరకు సంబంధిత ఎమ్మెల్యేలను అధికారులు ఆహ్వానించడం సర్వసాధారణం. ఎమ్మెల్యేలు సైతం తమకు ఉన్న వీలును బట్టి ఆయా కార్యక్రమాలకు హాజరవుతుంటారు. కానీ వారితో పాటు కేవలం టీడీపీ నేతలమన్న ఒకే ఒక్క కారణంగా కనీసం వార్డు మెంబర్లు కాని వ్యక్తులు సైతం వేదికలపై ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల పక్కన దర్జాగా కూర్చోవడం చర్చనీయాంశంగా మారుతోంది. ఒక రకంగా అధికారులు సదరు వ్యక్తి చెప్పినట్లుగా నడుచుకోవాలని ఎమ్మెల్యేలు సంకేతాలు ఇచ్చినట్లేనని, ప్రజాస్వామ్యంలో ఇది అంత మంచిది కాదని పలువురు పేర్కొంటున్నారు.

కమలాపురం నియోజకవర్గంలో యథేచ్ఛగా ఉల్లంఘనలు

కమలాపురం నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు షరా మామూలుగా మారాయి. తాజాగా సోమవారం జరిగిన చెన్నూరు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి పక్కన ఈ సమావేశానికి ఎలాంటి సంబంధం లేని టీడీపీ నేత విజయ భాస్కర్ రెడ్డి కూర్చోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించి ప్రొటోకాల్‌కు విలువ ఇవ్వాల్సిన ఎమ్మెల్యే సమక్షంలోనే ఇలాంటివి జరగడంపై విమర్శలు వినవస్తున్నాయి.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

తంబళ్లపల్లె : ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన త్వరగా పూర్తి చేయాలని, బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాబోయే వర్షాల పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హెచ్ఎన్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమీక్షా సమావేశం జరిగింది. మండలంలో ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన వందశాతం, రికార్డుల వెరిఫికేషన్ 80 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేయాలన్నారు. రాబోయే వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వీఆర్‌ఓలు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎక్కడ ఏమి జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ హరికుమార్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. కార్యదర్శులు వారి వారి పంచాయతీలలో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో గొర్రె అపహరణ

- 45 కిలోమీటర్ల మేర వెంబడించిన యువకులు
- పోలీసులను తప్పించుకునే క్రమంలో ప్రమాదం
- పోలీసుల అదుపులో ముగ్గురు

గాండ్లపెంట: పట్టుమని రూ.10 వేలు విలువ కూడా చేయని గొర్రెను అపహరించి ఓ కుటుంబం చిక్కుల్లో పడింది. ఆద్యంతం సినీ ఫక్కీలో జరిగిన ఈ అపహరణలో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వివరాలు...

కోలారు జిల్లా నుంచి వస్తూ..

కర్ణాటకలోని కోలారు జిల్లా రాయపాడు గ్రామానికి చెందిన తిమ్మప్ప,.... తన కుమారుడు రాజేష్, కుమార్తె ఆశతో కారులో సోమవారం తిమ్మమ్మ మర్రిమాను సందర్శనకు బయలుదేరారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మీదుగా తిమ్మమ్మ మర్రిమానుకు ఉన్న అడ్డదారిలో ప్రయాణిస్తున్న వారు.. మార్గం మధ్యలో తంబళ్లపల్లి మండలం ఎద్దులోళ్లకోట గ్రామం వద్ద రోడ్డు పక్కన విడిది చేసిన గొర్రెల మంద నుంచి ఓ గొర్రెను అపహరించి కారులో వేసుకున్నారు. విషయాన్ని గమనించిన కాపరి వెంటనే కేకలు వేయడంతో కారును ఆపకుండా ముందుకెళ్లిపోయారు.

45 కిలోమీటర్ల ఛేజింగ్

గొర్రెల కాపరి కేకలు విన్న చుట్టుపక్కల కొందరు యువకులు వెంటనే అప్రమత్తమై ద్విచక్ర వాహనాల్లో కారును వెంబడించారు. ఈ క్రమంలోనే కారు వెళుతున్న మార్గంలో రెక్కమాను, గాండ్లపెంటలో తనకు తెలిసిన జీవాల వ్యాపారులకు బాధిత కాపరి ఫోన్ చేసి విషయం తెలపడంతో వారు ఆయా ప్రాంతాల్లో కారును అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా కారును ఆపకుండా తిమ్మప్ప ముందుకు దూసుకెళ్లాడు. దీంతో దాదాపు 45 కిలోమీటర్ల మేర ఛేజింగ్ జరిగింది. చివరకు వ్యాపారుల నుంచి సమాచారం అందుకున్న గాండ్లపెంట పోలీసులు సైతం కారును ఆపే ప్రయత్నం చేయగా అక్కడ కూడా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాటర్ ట్యాంక్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం తంబళ్లపల్లి పోలీసులకు అప్పగించారు. అపహరించిన గొర్రెతో పాటు కారునూ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అడ్డుకుని అదుపులోకి తీసుకోవడంలో చొరవ చూపిన కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ కృష్ణవేణిని స్థానికులు అభినందించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలోని స్కేటింగ్ రింక్‌లో సోమవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. అండర్-11, అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఎంపికలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్ ఇజ్రాయిల్, కోచ్ విలియం కేర్, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

క్వాడ్ విభాగంలో..

అండర్-11 బాలికలు : కె. ఉపాసన, ఎస్.డి. సాదియ, యోధినిరెడ్డి.
అండర్-11 బాలురు : మహివర్షిత్‌రెడ్డి, సాఖీఫ్, భవేష్
అండర్-14 బాలికలు : మోక్షిత, మోహన, సహస్ర
అండర్-14 బాలురు : వెంకట్, యశ్వంత్‌కుమార్, పార్థీవ్
అండర్-17 బాలికలు : నందిని
అండర్-17 బాలురు : భరత్, వైష్ణవ్‌కృష్ణ, సాయి శశాంక్

ఇన్‌లైన్ విభాగంలో..

అండర్-11 బాలికలు : సన, నిర్వాణ
అండర్-11 బాలురు : పార్థివన్‌రెడ్డి, మారుతీశ్రీరాం , సాయిజయవర్ధన్.
అండర్-14 బాలికలు : దీత్యారెడ్డి, రాహిత
అండర్-14 బాలురు : సాకేత్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి, ప్రణీత్
అండర్-17 బాలురు : జెస్సీరోహన్